


ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 19 పుష్పం : 39-40 20-6-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 9 ISSUE : 19

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188

## "గుర్తులు తెలిపేవారే - గురువులు "

అజ్ఞానమనే కీకారణ్యంలో దారితప్పి దయనీయస్థితిలో ఉన్న జిజ్ఞాసి మొరను మన్నించి ఈదారి ప్రమాదం, ఈదారి సురక్షితం అనికొండగుర్తులు ఎప్పటికప్పడు తెలుపుతూ చేయూతనిస్తూ, మహదానందమైన గమ్యాన్ని జేర్చేవారే నిజగురువులు. ఆ ఉపకారానికి, రుణానికి బదులు యియ్యలేము, బాకీ తీర్చలేము. మాయతో నిండిన ఈలోకం సత్యమని, నిత్యమని బ్రమించే లోకవాసనను, శాస్త్రవాసనను, దేహవాసనను అధిగమించలేక మెదడును మొద్దుబారేలా చేసుకొంటున్నాము. సాధకుడు తూర్పునకు నడక సాగించి వెలుగును చేరాలి. కాని నడిచేది పడమరకు అందులోనూ చీకటిలోయ ఎంత నడిచినా వెలుగుకానరాదు. గురుచరణాలను పట్టుకొంటే, మార్గాన్ని మార్చి, జన్మపాపాలను కడిగి, దుఃఖాలను, కష్టాలను సులభతరం చేసి గమ్యాన్ని చేరుస్తారు. మనం ఏ కళను అభ్యసించాలన్నా ఒక మార్గదర్శికావాలి. ఈమహామాయను ఎన్ని విధాలదాట ప్రయత్నించినా ఫలితం శూన్యం. ఆత్మజ్ఞానం గురువు లేకుండా దొరకదు. బంధ, మోహ, మాయ అనే ఊబిలో కూరుకొన్నవాడిని ఒడ్డున ఉన్న గురువే రక్షించాలి. గురుబోధ ముందు అహంకారం నిలువలేదు. జపతపాలవల్ల మహిమల వల్ల నుదుటిబొట్లువల్ల, మెడలో మాలలతోనూ ఇలా ఎన్ని కర్మలు పెంచుకొన్నా మనోదాహం అధికమౌతుంది. అడివిలోమకాం వేసినా ఆనవాళ్లు అసలే దొరకవు. లేదా గ్రంధాలను వల్లె వేసినా, తలక్రిందులుగా తపస్సు చేసినా, సాధనలు ఎన్నిచేసినా, ఆసనాలు మార్చినా, ఆనందాన్ని అందుకోలేము. పూర్ణగురువులను శరణువేడి, వారి బోధను నమ్మి, త్రికరణశుద్ధిగా ఆచరిస్తే అహంకారమును వీడుతాము. గురురూపాన్ని సదా ధ్యానించేవాడిని, గురునామాన్ని స్మరించేవాడిని గురువు నిరంతరం కాపాడుతాడు. గురుప్రసన్నతను పొందితే జీవితానికి ఏలోటురాదు. అంతేకాదు మళ్లా మళ్లా పుట్టము-చావము, జీవనం సుఖమయమౌతుంది. నిజంచెప్పాలి అంటే ప్రేమగురువు దొరికితే గురువేసాధన - గురువేసాధ్యం. శ్రీనాన్నగారు యిలా అంటారు "ఈ సుద్దలకు, మొద్దులకు ప్రేమించటం తెలుసా మీ గురువే ఆయన్ని ప్రేమించుకొనేలా చేసుకొంటాడు" అన్నారు. జ్ఞానదీపం గురువే వెలిగిస్తాడు. అంతవరకూ మనం "మాయ" అనే చీకటిని చీల్చి చెండాడలేము, భవసాగరాన్ని దాటలేము. గురుదయ ఉంటే విషం అమృతంగా మారుతుంది, మాయకు వశంకాము, పావనమూర్తిగా మారుతాము.

**సాగిరాజు రామకృష్ణంరాజు**

అర్ధవరం

ఈ సంచికలో......

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు**

08-01-04 జిన్నూరు ........ 2
30-03-04 పాలకోడేరు ........ 10



* * * *

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 8-1-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నేనుజపం చేసుకొంటున్నాను అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటే జపసాధన కొనసాగించవచ్చు అన్నారు భగవాన్. భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం అన్నిమార్గాలను సమన్వయం చేసుకొని ఆధ్యాత్మికపురోగతిని సాధించాలి, ఆత్మానుభవమును పొందాలి. తమోగుణం లేకుండా మనపని మనం శ్రద్ధగా చేసుకొంటే మనం స్వతంత్రులుగా జీవించవచ్చు. మనపని మనంచేసుకోకుండా బద్ధకస్తులుగా తయారయితే మనంలోకాన్ని దాటలేము, లోకాన్ని దాటలేనివాడికి మోక్షం ఏమిటి? లోకంలో అనేకరకాల మనుషులు ఉంటారు. కొంతమంది మనలనుచూసి సంతోషించేవారు ఉంటారు, కొంతమంది అసూయపడేవారు ఉంటారు. అది మనకు సంబంధంలేదు. వాటిని పట్టుకొంటే మనం లోకాన్ని దాటలేము. మనలను చూసి సంతోషించేవారిలోను, అసూయపడేవారిలోను కూడా భగవంతుడిని చూడాలి. అసూయపడేవారిలో భగవంతుడిని ఎలా చూస్తాముఅంటే అలా చూడటంనేర్చుకోవటానికే సాధన. సత్వగుణం నేర్చుకొనేటప్పడు మనకు తెలియకుండా తమోగుణం, రజోగుణం వచ్చేస్తూ ఉంటాయి, అవిరాకుండా చూసుకోవాలి. సత్వగుణంలో

ఉన్నవాడు కూల్‌గా ఉంటాడు, శాంతిగా ఉంటాడు, వాడిపని వాడు చేసుకొనిపోతాడు, వాడికి పని ముఖ్యం గాని లోకంగొడవ వాడికి అక్కరలేదు. లోకానికి ఏదైనా హితవుచేసిన నిర్మలంగా చేస్తాడు, వాడికి పబ్లిసిటీ అక్కరలేదు. స్నేహితులలోను, విరోధులలోను భగవంతుడినే చూడాలి, అలాచూడలేకపోతే మనం లోకాన్ని దాటలేము. మన ఇంట్లోను, సమాజంలోను రకరకాల మనస్తత్వంగల మనుషులు ఉంటారు, అంటే వారిపూర్వజన్మ సంస్కారాన్ని బట్టివారు జీవిస్తూఉంటారు, అందుచేత ఆవిషయాలు మనకు అనవసరం. ఎట్టిపరిస్థితులలోను మనం తొందరపడకూడదు. తొందరపడితే ప్రమాదంలో పడతాము. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా దైవంమీద భారంవేసి జీవించటం నేర్చుకోవాలి కాని మాటలో తొందరపాటు పనికిరాదు, వ్యవహారంలో తొందరపాటు పనికిరాదు. తొందరపాటు ఉంటే ముందు మనమేనష్టపోతాము.

ఈలోకంలోనికి వచ్చినందుకు మనం ఇహం, పరం రెండు సాధించాలి, దీనికి సత్వగుణం అవసరం. నేను కాలరూపంలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనకు మానవజన్మఇచ్చాడు. మనిషికి జంతువుకు పెద్దతేడా ఏమీలేదు మనిషికి ఆలోచన ఇచ్చాడు అందుచేత జాగ్రత్తగా ఆలోచనను ఉపయోగించుకొని మీరు బాగుపడాలి. మిమ్మల్ని చూసి నేను ద్వేషపడుతున్నాను అనుకోండి, నాలోస్వార్థం ఉంది కాబట్టి మిమ్మల్ని చూసి ద్వేషపడుతున్నాను. మనం వివేకాన్ని పెంచుకోవాలి లేకపోతే మానవజన్మ యొక్క ప్రయోజనంలేదు. ఈశరీరం స్మశానంకు వెళ్ళకముందే ఈశరీరాన్ని మనస్సను ఆత్మజ్ఞానసముపార్జనకు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. కొన్ని అనుభవాలు పొందటానికి మనం ఈభూమి మీదకు వచ్చాము, ఆ అనుభవాలు పొందటంవలన మనహృదయం యొక్క లోతులు పెరుగుతాయి, బుద్ధిసూక్ష్మత పెరుగుతుంది. మనకు సబ్జక్టుప్రధానం, ఆలోచన ప్రధానం. అల్లాడి కృష్ణమూర్తిగారికి గవర్నరు పదవి ఇస్తాముఅంటే ఆలోచించి చెపుతాను అని చెప్పలేదు వెంటనే నాకు గవర్నరు పదవి వద్దు అనిచెప్పారు. నాకు లా అంటేఇష్టం, నాకు సబ్జక్టు ప్రధానంకాని గవర్నరుపదవి ప్రధానం కాదు అని చెప్పారు. ఆయనకు లా అంటే ఎంతఇష్టమో మన సబ్జక్టుపట్ల మనకు అంతఇష్టం ఉండాలి. మనం ఎవరైనా పొగిడితే పొంగిపోతాము, ఎవరైనా విమర్శిస్తే కృంగిపోతాము అంటే మనకు వివేకం తక్కువగా ఉన్నట్లుగుర్తు. జయాన్ని అపజయాన్ని సమానంగా చూడమని గీతలో చెప్పాడు. దేహప్రారబ్ధమునుబట్టి జయాలు, అపజయాలు వస్తూఉంటాయి. అల్లాడిలాంటి గొప్పప్లీడరుకూడా కొన్ని కేసులలో ఓడిపోయేవాడు, అది దేహప్రారబ్ధం. నీవు జయాపజయాలను సమానంగా తీసుకో. మనం లాభంవచ్చినప్పడు ఒకరకంగా, నష్టం వచ్చినప్పడు ఒకరకంగా ఉంటాము అనుకోండి





మన మనస్సు లోపలకు వెళ్ళదు, బాహ్యముఖానికి పోతుంది. మేముఏదో సాధన చేస్తున్నాము, పూజచేస్తున్నాము అంటే ఆత్మసాక్షాత్కారంకలుగదు. ఏక్షణానికి ఆక్షణం మనం జాగ్రత్తగా ఉండాలి. ఉపనిషత్‌లలో చెప్పినట్లు కత్తి అంచు మీద నడిచేవాడు ఎంతజాగ్రత్తగా ఉంటాడో అంత జాగ్రత్తగా శరీరాన్ని, మనస్సును దగ్గర పెట్టుకొని, వాటిని ఆత్మజ్ఞానసముపార్జనకు ఉపయోగించుకొంటూ జీవించాలి. మీరు గాఢనిద్రను గుర్తుపెట్టుకోండి అని భగవాన్ చెప్పారు. గాఢనిద్రలో మనం ఉంటాము కానిఇంక ఏమీ ఉండదు. గాఢనిద్రలో మనస్సు, శరీరం, ఇంద్రియాలు అన్నీ అణిగిపోతాయి కాని గాఢనిద్రలో మనం ఉన్నామాలేదా అంటే మనం ఉన్నాము. ఆస్థితిని జాగ్రదవస్థలో తెచ్చుకొంటే ఇంక మీకు పునర్జన్మలేదు, శవాలను మోయనక్కరలేదు, లోకాలకు తిరగనక్కరలేదు, అంతటామీరే ఉంటారు. అంతటా ఉన్నవాడికి రాకలేదు, పోకలేదు. మీరు కష్టపడి సాధనచేసి, ప్రయత్నంచేసి ఆస్థితిని సంపాదించుకోండి, ఈశ్వరునిదయను సంపాదించుకోండి అని మనకు హితవు చెపుతున్నారు. విన్నవారు లాభంపొందుతారు, అహంకారం పెట్టుకొని మేము భగవంతుని మాట వినము అంటే మీరునష్టపోతారు. గొప్పకోసం మనం ఒకమాటకూడా మాట్లాడకూడదు. మాటలో, చేతలో, ఆలోచనలో ఆడంబరం ఉండకూడదు. జీవితవిధానంలో ఆడంబరం పనికిరాదు. ఈ ఆడంబరాలవలననే మనం పాడైపోతున్నాము. పోనీ లోపలఉన్న వస్తువు ఆడంబరంగా ఉందా అంటే అది ఆడంబరంగా లేదు, నిరాడంబరంగా ఉంది. మనం ఆడంబరంగా జీవిస్తూ ఉంటే నిరాడంబరంగా ఉన్నవస్తువు మనకు ఎలా తెలుస్తుంది.

భగవంతుడు మనహృదయంలో ఉన్నాడు, నేను ఉన్నానని చెప్పటంలేదు. ఆయన పనిచేస్తున్నాడు కాని నేను పనిచేస్తున్నాను అని చెప్పటంలేదు ఎందుచేతనంటే నేను పనిచేస్తున్నానని ఆయన అనుకోడు, అనుకొంటే చెప్పేవాడు. మనం కష్టపడి పోతున్నాము అని అనుకోవటం వలన చెపుతున్నాము. భగవంతుడు చెప్పినట్లుగా జీవిస్తే మనకు తెలివితేటలు పెరుగుతాయి, బానిసత్వబుద్ధి పోతుంది, మోక్షంవస్తుంది. లోకంలో రకరకాల వికారాలు ఉన్న మనుషులు ఉంటారు మనస్సు ఉన్నప్పడు వికారాలు ఉంటాయి. గాఢనిద్రలో మనస్సులేదు అక్కడ వికారాలులేవు. గాఢనిద్రలో మనం ఏదిగా ఉన్నామో అదేమనం, దానిని ఎరుకలోనికి తెచ్చుకోవటమే జీవితగమ్యం. గాఢనిద్రలో ద్వేషం, కోపం, స్వార్థం ఇవి ఏమీలేవు ఎందుచేతనంటే ఇవిఅన్నీమనస్సుకు సంబంధించినవి. గాఢనిద్రలో మనస్సులేదు అందుచేత దానికి సంబంధించిన వికారములు ఏమీ అక్కడలేవు. మనస్సు నశిస్తేగాని గాఢనిద్రలోని స్థితి జాగ్రదవస్థలోకిరాదు. మనలోని స్వార్థం కారణంగా మనకు ఆత్మజ్ఞానం కలగటంలేదు. మనం ఎంతోకొంత స్వార్థం తగ్గించుకోకపోతే లోకానికి మంచిచేయలేము. స్వార్థం ఉన్నవాడికి కోరిక, కోపం, ద్వేషం. ఈ దుమ్ము అంతా

స్వార్థంలోనుండి వస్తోంది. గాఢనిద్రలో ఇది ఏమీలేదు అందుచేత గాఢనిద్రను గురువుగా పెట్టుకోమని భగవాన్ చెప్పారు.

అందరిలోను భగవంతుడిని చూడు, వారి వికారములతో మనకు సంబంధంలేదు, వాళ్ళ పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి వారు ప్రవర్తిస్తూ ఉంటారు, మనం అలా ప్రవర్తించకూడదు, భగవంతుడు చెప్పినట్లుగా ప్రవర్తించాలి. దాని వలన తెలివి పెరుగుతుంది, మనపని శ్రద్ధగా చేసుకోగలము, లోకాన్ని దాటి బయటపడతాము. మనకు కళ్యాణగుణాలు అంటే ఇష్టంలేదు ప్రకృతిగుణాలు అంటే ఇష్టం కాబట్టి జన్మలు వస్తున్నాయి. నీవు వెయ్యి ఎకరాలు ఇచ్చి చనిపోతే 12వ రోజున మర్చిపోతారు. కేవలం నీకుటుంబాన్ని దృష్టిలో పెట్టుకోవద్దు. నీకుటుంబానికి ఇచ్చేదిఇచ్చి, కొంత సమాజానికి కూడా ఇవ్వు అని భగవంతుడు చెపుతున్నాడు. కుటుంబానికి ఇచ్చినది కరెక్టు, ఇతరులకు ఇచ్చినది అంతా వేస్టు అని కొంతమంది అనుకొంటారు అలాకాదు ఇతరులకు ఇచ్చినదే మనకు పరలోకంలో కలిసివస్తుంది, మనం అనుభవించినది చివరకు రోగంకింద వస్తుంది. కొంతమంది ధనం ఉందికదా అని అవసరాలు పెంచుకొంటారు చివరకు ఏమౌతుంది అంటే సాధనవిడిచిపెట్టేస్తారు, మనం ఏదిగా ఉన్నామోదానికి దూరమవుతాము, మనస్సు పల్చబడటానికి బదులు చిక్కబడుతుంది, ఇంద్రియాలకు వికారాలు వస్తాయి, ఆరోజుకారోజు వివేకం తగ్గుతుంది. నీబుద్ధిని సంస్కరించుకొంటే నీకు చైతన్యానుభవం కలుగుతుంది. నిన్ను నీవు తెలుసుకోకుండా లోకంలో ఎన్ని సంపాదిస్తే మటుకు నీకు ఏమి కలిసి వస్తుంది. లోకంలో ఏదో సుడిగుండంలో పడితే ఇంక బయటకురాలేము. ముందు మనం లోకాన్ని దాటటం నేర్చుకోవాలి.

అవతారపురుషులలో కృష్ణుడినిగాని, రాముడినిగాని లేకపోతే మీకు నచ్చిన గురువును గాని ఉపాసన చేయండి, మన మనస్సు అక్కడ నిలబడాలి. ఆయన నామాన్ని స్మరిస్తూ, ఆయన రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే మన నామరూపములకు దూరమవుతాము. మనం ఎంతసేపు మన నామరూపముల మధ్య తిరుగుతున్నాము. ఆరూపాలు, నామాలు నిజమా అంటే అవి నిజం కాదు. మన తాతలు, ముత్తాతలు ఎంతో మంది వచ్చారు వారి రూపాలు నామాలు ఇప్పుడు కనబడటం లేదు, వినబడటం లేదు. వారి కంటే మనం గొప్పవారమా, కాదు. గొప్ప గొప్ప ఘనకార్యాలు చేసిన వారి రూపాలే కాలప్రవాహంలో కొట్టుకొనిపోయాయి. మన రూపం ఎంత? మన నామం ఎంత? ఇలా తాత్కాలిక విషయాలు పట్టుకొని శాశ్వతసుఖాన్ని, ఆనందాన్ని వదిలేస్తున్నాము. అప్పడప్పడు మనకు కొన్ని సుఖాలు, సంతోషాలు వస్తున్నాయి, ఇవి అన్నీ అసత్యాలు. అసత్యమైన సుఖాలు రోగాలకు దారి తీస్తాయి.

సత్యమైన సుఖం,శాంతి మన హృదయంలో ఉంది, దానికి రూపం లేదు, నామంలేదు. అక్కడ ఉన్న వస్తువే భగవంతుడి రూపం ధరించి వచ్చింది. భగవంతుడి రూపాన్ని ధ్యానించటం వలన, ఆయన నామాన్ని స్మరించటం వలన ఆయన మనలను హృదయంలోనికి తీసుకొనివెళతాడు. మన హృదయంలో ఉన్న సుఖం స్వతంత్రమైనది, అది సత్యమైనది కాబట్టి ఎంత అనుభవించినా నీకు వెగటుపుట్టదు. ఏదో భగవంతుడి నామాన్ని జపంచేసుకో, నామాన్ని విడిచిపెట్టవద్దు. ఆవు అంటే దాని కళ్ళు, దాని కాళ్ళు మొత్తం దాని రూపం అంతా మనకు గుర్తుకువస్తుంది. అలాగే కృష్ణ అంటే కృష్ణుడి యొక్క శక్తి, ఆయన అనంతత్వం, ఆయన లీలలు అన్నీ జ్ఞాపకం వస్తాయి, అలాగే కాశీ అంటే అక్కడి గంగా, విశ్వేశ్వరుడు అన్నీ మనకు స్ఫురణకు వస్తాయి అంటే నామంకు అంతశక్తి ఉంది. నామ జపం మీరు చేసుకోండి అయితే దాని యందు ప్రీతి, ప్రేమ ఉండాలి. మనం చిన్నచిన్న పనులు అశ్రద్ధగా చేస్తాము. ఆ చిన్నపనులే శ్రద్ధగా, ప్రేమగా, ఆప్యాయతగా చేస్తూఉంటే ఆధ్యాత్మికంగా అందరూ పెద్దవారు అయిపోతాము. భగవంతుడు చెప్పిన ప్రతీ మాటను మన గుండెలో దాచుకోవాలి ఎందుచేతనంటే ఆమాట ఎందుకు చెప్పాడు అంటే ఆయన అనుభవాన్ని పొందటం కోసం, ఆయనలో ఐక్యమవ్వటం కోసం ఆమాటలు చెప్పాడు.

సమాధానపరిచే వారు ధన్యులు వారు దేవుని చూసెదరు. ఎవరికయినా పేచీలు వస్తే మనకు చేతనయితే వారిని సమాధానపరచాలి లేకుంటే నోరుమూసుకొని పడిఉండాలి అంతేగాని కొంతమంది ఆపేచీలు పెంచేస్తారు. నువ్వు నాలుగు గంటలు పూజచేసి, జపంచేసి ఎవరికయినా పేచీలువస్తే వారిని సమాధానపరచకుండా ఆపేచీలు పెంచేస్తూఉంటే నీకు భక్తి ఏమిటి అన్నాడు యేసు. మనమతాన్ని, మనదేశాన్ని పాడుచేసుకొనే పనులు మనంచేయకూడదు. ఈపనిచేయటం వలన, ఈమాట మాట్లాడటం వలన మనకు ఆధ్యాత్మికంగా బలహీనత వస్తుంది అనుకొన్నప్పడు ఆపనిచేయకూడదు, ఆమాట మాట్లాడకూడదు. మనమాట, మనచేత మన ఆధ్యాత్మికఅభివృద్ధినిగాని, భౌతికఅభివృద్ధిని గాని బలహీనపర్చకూడదు. ఏదోఒక నామాన్ని చేసుకొంటూఉంటే నీ మనస్సు ఆ ఒక్కతలంపు మీదే ఉంటుంది. మరి జన్మాంతరం నుండి పోగుచేసుకొన్న ఇతరతలంపులు ఉన్నాయికదా అవివస్తూఉంటాయి, నీవుజపం చేసుకొంటూఉంటే అవి మరల వెనక్కి వెళ్లిపోతాయి. నీవు బిజీగా పనిచేసుకొంటూఉంటే మీ ప్రక్క ఇంటివారు వచ్చినా తిరిగివెళ్ళిపోతారు. మీరుఖాళీగా ఉంటే కూర్చొని కబుర్లుచెపుతారు. అలాగే నీ మనస్సును ఖాళీగా ఉంచకుండా ఏదోఒకనామాన్ని జపిస్తూఉంటే, నీమనస్సు ఒకేతలంపు మీద ఉంటే ఇతర తలంపులువస్తూ ఉంటాయి, వెళ్లిపోతూఉంటాయి. తలంపువచ్చినా దానిని ఆచరణలో పెట్టకుండా ఉంటే ఆతలంపునశిస్తుంది. సినిమాచూడాలనే తలంపువచ్చింది అనుకో, ఇది ఒకఅలవాటు

అని అనుకొని, మనం నామజపం విడిచిపెట్టకుండా ఉంటే ఆతలంపు క్షీణిస్తుంది. హృదయంలో సత్యవస్తువు ఉంది. కాని మన అలవాట్ల యొక్క వేగం వలన అది మనకు తెలియటంలేదు. ఆవస్తువును తెలుసుకోవటానికే నిష్కామకర్మ చేయమని చెప్పారు. నీవు చేసేపని సత్యానుభవం పొందటానికి నీకు సహకరించాలి. సత్యం అనుభవంలోనికి వస్తేగాని దాని తాలుక సుఖంకాని, శాంతి గాని మనకు తెలియదు. మనస్సును బాహ్యాముఖపరిచే అన్ని తలంపులుకూడా మనకు చెడ్డచేస్తాయి. ఏతలంపులు అయితే నిన్ను ఇబ్బంది పెడుతున్నాయో ఆతలంపులను నీవు బలహీనపరచాలి, వాటిని బలహీనపరచటం వలన ఈ జన్మలోనే నీకు సత్యసాక్షాత్కారం అవుతుంది.

నీహృదయంలో సత్యవస్తువుఉంది, మనస్సును అంతర్ముఖ పరచి దానిమూలంలో మనస్సును ఉంచటం వలన నీవు హృదయంలో ఉన్నవస్తువును పొందగలవు. మనం ఒకరూపంతోటి, ఒకనామంతోటి తాదాప్యం పొందుతున్నాము. ఈరెండూ మనంకాదు, ఈరెండూ నిజంకాదు. రూపంగొడవ, నామం గొడవ మనకు గాఢనిద్రలోలేదు. సత్యవస్తువుకు నామరూపములు లేవు, మనం నామరూపముల చుట్టూ తిరుగుతున్నాము. జపధ్యానములు ఎందుకు అంటే మనం భగవంతుడినామాన్ని నిరంతరం స్మరించటం వలన, ఆయనరూపాన్ని ధ్యానించటం వలన రూపంలేని, నామంలేని స్థితికి నీవు ఆరాధించే దైవమే నిన్ను మోసుకొనిపోతుంది. మీరు ఏదోమార్గంలో తరించటంముఖ్యం. భక్తిమార్గంలో ప్రవేశించటం తేలిక, దానిని చివరివరకు కాపాడుకోవటం కష్టం. స్నేహంచేయటం తేలిక దానిని కాపాడుకోవటం కష్టం. సత్వగుణం ఉన్నవారి స్నేహం నిలబడుతుంది. తమోగుణం, రజోగుణం ఉన్నవారి స్నేహం నిలబడదు. భక్తిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. భక్తిలేకుండా ముక్తిరాదు. భక్తిలేని వారితో స్నేహంచేస్తే మనం సంపాదించుకొన్న భక్తిపోతుంది. మాటదగ్గర జాగ్రత్తగా ఉండాలి. భగవంతునికి సంబంధించిన మాట తప్పించి ఇంకోమాట రాకూడదు అప్పుడు ఆయన దయకు పాత్రులవుతాము. భగవంతుడు ఎందుకు అవతరిస్తున్నాడు అంటే కర్మానుభవం కోసం భగవంతుడు అవతరించటంలేదు, కేవలం మానవజాతిపట్ల దయకొలది అవతరిస్తున్నాడు. అందుచేత ఆయన శరీరం శాంతే, శరీరం ఆనందమే, శరీరం జ్ఞానమే, ఆయన ప్రతీకదలిక జ్ఞానం, అక్కడ ఉన్నదే జ్ఞానం. భగవంతుడి యొక్క ఔన్నత్యం, వైభవం భక్తుడికి తెలుస్తుందికాని ఈసుద్దలకి, ఈగోడలకు ఏమితెలుస్తుంది, భక్తులుకానివారికి ఏమితెలుస్తుంది.

గాఢనిద్రలో మనం ఇంకా ఉండాలని అనుకోము. జాగ్రదవస్థలో మనం ఇంకా ఉండాలి అని అనుకొంటాము, అలాఅని ఎవరు అనుకొంటున్నారు, మనమనస్సే అనుకొంటోంది. గాఢనిద్రలో మనస్సులేదు అందుచేత ఇంకా ఉండాలి అనే తలంపు అక్కడలేదు. ఇంకా ఉండాలి అని అనుకొంటున్నాము అంటే మనం అజ్ఞానంలో ఉన్నామని అర్థం. ఒకవేళ ఉంటే మనం ఏమైనా సాధన చేసుకొంటున్నామా అంటే ఏమిసాధన లేదు, లోకానికి సంబంధించిన, శరీరానికి సంబంధించిన వాసనలు పెంచుకొంటున్నాము, కోరికలు పెంచుకొంటున్నాము ఇవి రాబోయే నీచజన్మలకు పునాదులు. మనలను లోకంలోనికి పంపేసాడు, ఆయన చూస్తూఉంటాడు, మనకు లోకం అంటే ఇష్టంగా ఉందా ఆయన అంటే ఇష్టంగా ఉందా అని భగవంతుడు చూస్తూ ఉంటాడు ఆయన సర్వసాక్షి, సర్వజ్ఞుడు, ఆయనకు తెలియనది అంటూఏమీలేదు. మనకు లోకంఅంటే ఎంత ఇష్టం ఉందో అంత ఇష్టం భగవంతుడి మీద ఉంటే మనలను ప్రకృతిలో నుండి బయటకు లాగేస్తాడు. మనకు లోకం మీద ఇష్టం ఉందిఅనుకో, ఆయన మీద ఇష్టంలేదు అనుకో ఆయన మనలను వదిలేస్తాడు, ప్రకృతి మనలనులాగేస్తుంది, ఆరోజుకారోజు ఆజన్మకుఆజన్మ చీకటిలోకాలకు పోతాము. ఆయనమీద ఇష్టం, ప్రేమ పెంచుకొంటాము అనుకోండి, మనంమాట్లాడేమాట, మనం చేసేపని ఆయనకోసమే చేస్తూఉంటే ఎప్పుడో మనకు తెలియకుండా మనమనస్సును సమాయత్తం చేసి ఆయన స్వరూపాన్ని మనకు ఇచ్చేస్తాడు. నీహృదయంలో ఉన్నశాంతి, సుఖం నీకు తెలియనప్పుడు నీవు ఏమిసాధించినా అది అంతా స్వప్నసమానమే. మనం హృదయగుహలోనికి ఎప్పుడైతే వెళ్ళిస్థిరపడ్డామో ఇంక దేహమనే గుహలోనికి రానక్కరలేదు.

జపం చేసేటప్పుడు మొదట నీ ప్రయత్నం అవసరం, తరువాత నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా జపంసహజంగా జరిగిపోవాలి అంతవరకు నీవు ప్రయత్నం చేయాలి. జననమరణములు అనేవి ఒక పెద్దజబ్బు. బ్రహ్మంకు జననం లేదు, మరణంలేదు. వారుపుట్టరు కాబట్టి చావరు, ఆపుట్టని వాడిని పట్టుకొంటే మనకు పుట్టుక లేకుండా చేస్తాడు. ఏవోమంచికార్యక్రమాలు చేసినంతమాత్రంచేత ఆజబ్బు తగ్గదు. ఆజబ్బుతగ్గాలంటే ఆజబ్బులేనివస్తువు అనుభవంలోనికి రావాలి. నీవు యాత్రలు, పూజలు జపాలు చేస్తున్నావు మంచిదే, ఇవి అన్నీ చేస్తున్నా నీకు మరణంలేనివస్తువు అనుభవంలోనికి రాకపోతే చావటంతప్పదు, పుట్టటం తప్పదు. సబ్జక్టు చెప్పటంలో భగవాన్ రాజీపడరు. మనకు నేను అనేటప్పటికి మనస్సు ఎలాస్పురిస్తోందో అలాగ నేను అనేటప్పటికి లోపలఉన్న చావులేని వస్తువు మనకు స్ఫురిస్తేనే జననమరణములు అనేజబ్బు తగ్గుతుంది కాని అంతవరకు ఈజబ్బు తగ్గదు. మనం చచ్చేవాడి పాదాలు పట్టుకొంటాము కాని చావులేనివాడి పాదాలు పట్టుకోము. మన బుద్ధి అటుతిరగటానికి మనం ఏమైనామంచిపనులు చేస్తే కదా, మంచిమాటలు వింటే కదా. నీముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం సత్కర్మ విడిచిపెట్టవద్దు

అని ఉపనిషత్ చెప్పింది. ఈజన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా నీవుచేసిన సత్కర్మే నిన్ను చావులేని వస్తువు దగ్గరకు తీసుకొనివెళుతుంది. వివేకం వలన, విచారణ వలన, త్యాగబుద్ధి వలన, సత్కర్మ వలన నీకు అమృతానుభవం కలుగుతుంది కాని బాహ్యప్రక్రియల వలన నీకు  కలుగదు. దుమ్ము అంతా శరీరంలోను, మనస్సులోను ఉంది, పుట్టినది మొదలు చనిపోయే వరకు ఈదుమ్ము అంతారాసుకోవటం. శరీరం, మనస్సు ఇవి రెండే మనలను పాడుచేస్తున్నాయి. గాఢనిద్రలో ఈ రెండింటి గొడవ మనకు లేదు, జాగ్రదవస్థలోకూడా వీటి గొడవ వదిలించుకొంటే మనకు అమృతానుభవం కలుగుతుంది.

మనిషి పుట్టాడు అంటే ఏదోరకమైన శోఖం తప్పదు, వెలితి తప్పదు. మీరు ఏదోచెపుతున్నారు, మీధ్యేయం ఏమిటి, మీలక్ష్యం ఏమిటి అని మాటీవి వారు నన్ను అడిగారు. మాకు చేతనయినంతవరకు జీవుడిని శోఖరహితస్థితికి తీసుకొని వెళ్ళటమే మాలక్ష్యం అంతేగాని ఎవరికో భక్తుడిని చేయటం  మాలక్ష్యంకాదు అని మాటీవి వారికి చెప్పాను. ఏ వస్తువులో అయితే శోఖం లేదో ఆ వస్తువు పొందినప్పడే మీరు శోఖరహితస్థితికి ఎదిగివస్తారు. అది మీ ధనం వలన, అధికారం వలన, చదువు వలన రాదు, ఆ వస్తువు తాలుక అనుభవంలో మీరు స్థిరపడాలి. అప్పడు జన్మించటం మరణించటం అనే పెద్దజబ్బులో నుండి విడుదలపొందుతారు. నీవు చనిపోయేవరకు నీమనస్సు ఇష్టం, అయిష్టం మధ్య తిరుగుతూ ఉంటుంది, వాటిలో నుండి నీ మనస్సును విడుదల చెయ్యి అది వెళ్ళి గూటిలోపడిపోతుంది. హృదయంలో ఉన్న సద్వస్తువును ఈజన్మలో పొందలేకపోయినా కనీసం దానిని పొందటానికి అనుగుణంగా మన జీవితంలో మార్పు వస్తోందో, లేదో చూసుకోవాలి కదా అన్నారు గాంధీగారు.  మారిపోయాము అని నోటితో చెప్పటం కాదు నిజంగా నీకు మారుమనస్సు వచ్చిందో లేదో చూసుకో, నీ పని ఏదో నీవుచేసుకో, ఇతరుల వ్యవహారాలు నీ నెత్తి మీదపెట్టుకోవద్దు, కావాలని వ్యాపకాలు పెంచుకోవద్దు, దానివలన నీ మనస్సు పెరుగుతుంది. అలాగని నీ చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టవద్దు, నామజపం విడిచిపెట్టవద్దు, నామం కూడా దేవుడితో సమానము. జపం చేస్తూ ఉంటే నీకు ఇతరతలంపులు, సమస్యలు, చిరాకులు రావు, అశాంతి రాదు.  ఇష్టం, అయిష్టం, కోపం, భయం ఇవి అన్నీ కూడా తలంపు రూపంలో వస్తాయి. జపంచేయటం వలన ఈ తలంపులు అన్నీ క్రమేపి తగ్గిపోతాయి. భగవంతుడి నామాన్ని నిరంతరం చింతించటం వలన మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, బుద్ధి శుద్ధి అవుతుంది. జపంచేయగా చేయగా ఇతరతలంపులు అన్నీ ఆగిపోయి చివరకు ఒకే తలంపు మిగులుతుంది, చివరకు ఆతలంపు కూడా దాని మూలంలో కలిసిపోతుంది అప్పడు నీకు ఆనందానుభవం కలుగుతుంది. అప్పడు దేహం ఉన్నాలేకపోయినా, లోకం కనిపించినా కనిపించకపోయినా మనం ఉంటాము అనే





అనుభవం కలుగుతుంది, అప్పడు వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినాశాంతే. మనకు భావనాబలం ఉండాలి.  భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని స్థిరమైన బుద్ధికలవాడు భావనాబలం ఉన్నవాడు.  మనలను మనం అనుమానించుకోవటంలేదు. ఉన్నదానిని అనుమానిస్తున్నాము.  మనకు భావనాబలం లేకపోవటం వలన ఇలా ఉన్నదానిని అనుమానిస్తున్నాము.  నీవు రోజూశరీరాన్ని మనస్సును బాడిచేసుకోవద్దు.  అనవసరంగా శ్రమపడవద్దు.  వివేకాన్ని, బుద్ధిసూక్ష్మతను పెంచుకో.  నీవుదేహం చుట్టూ మనస్సుచుట్టూ తిరుగుతున్నావు.  ఇవేనిన్ను పాడుచేస్తున్నాయి.  బ్రహ్మం ఈరెండింటికి అతీతంగాఉంది. ముందు ఈ రెండింటి గొడవ వదలించుకో అప్పడు వస్తువు తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 30-3-04, పాలకోడేరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శ్రీరామనవమి.  రాముడిని మర్యాదపురుషోత్తముడు అని పిలుస్తారు. భగవంతుడికి రూపంలేదు, నామంలేదు కాని మనం ఉపాసన చేసుకోవటానికి రూపంధరిస్తాడు.  అహంకారం, మమకారం ఉన్నవారు రూపంలేని, నామంలేని భగవంతుడిని ఆరాధించటం కష్టం, వారు నిరాకారబ్రహ్మమును, నిర్గుణబ్రహ్మమును ఆరాధించలేరు అందుచేత భగవంతుడు రూపంధరించివస్తాడు.  రామనామం లక్ష్మీప్రదమైనది.  మీకు లక్ష్మీకటాక్షం కావాలంటే రామాయణం పఠించండి జయం కావాలంటే భారతం పఠించండి, వైరాగ్యం కావాలంటే భాగవతం పఠించండి అని పెద్దలు చెపుతారు.  రామయ్య మాతండ్రి, సీతమ్మ మాతల్లి అని కొంతమంది వారి తల్లితండ్రులకంటే ఎక్కువగా ఎంతో గౌరవంగా, ఎంతో భక్తిగా సీతారాములను చూసుకొంటారు, అంటే సీతారాముల యొక్క గాధ అటువంటిది.  ప్రేమ, సేవ ఇవి రెండూ రామాయణంలో మనం నేర్చుకోవాలి. రామచంద్రమూర్తి అన్నదమ్ములు నలుగురు.  రాముడు పరమాత్మ.  వేదాలలో ఏధర్మం గురించి అయితే చెప్పారో ఆధర్మమే రాముడి రూపం ధరించి వచ్చింది అని పెద్దలు చెపుతారు.  మనకు ఎంతధనం ఉన్నా, కీర్తిఉన్నా, పాండిత్యం ఉన్నా ధర్మాన్ని ఆచరించకపోతే వాడికి మోక్షం కలుగదు అని పెద్దలు చెపుతారు.  రాముడు ధర్మం దగ్గర ఎవరితోను రాజీపడలేదు.  లక్ష్మణుడు సేవాతత్పరుడు, భగవంతుడికి సేవచేసాడు.  భక్తి మనం భరతుడిని చూసి నేర్చుకోవాలి.    లోపలఉన్న వికారములను జయించినవాడు శత్రుఘ్నుడు. రాముడిసోదరుల యొక్క విశిష్టత అట్టిది.  ఆస్తులకోసం మాకు కావాలి మాకు కావాలి